క్లుప్తంగా

యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా ప్రశాంత్


ప్రశాంత్

జమ్మికుంట/హుజూరాబాద్ రూరల్ : యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా పట్టణంలోని శాలవాడకు చెందిన తే లుకుంట్ల ప్రశాంత్ (సన్నీ)ను నియమిస్తూ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పడాల రాహుల్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ... తన నియామకానికి సహకరించిన మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సాయిని రవికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

యువకుల రక్తదానం


విద్యార్థినికి సైకిల్ అందజేస్తున్న నాయకులు

మానకొండూర్: మానకొండూరు జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్, పుట్టినరోజు వేడుకలు మండల కేంద్రంలో ఆదివారం ఘనంగా జరిగాయి. పలువురు యువకులు రక్తదానం చేయగా, ఎంపీటీసీ పిట్టల కవిత మధు పచ్చునూరు ఉన్నత పాఠశాలలో చదువుతున్న అక్షిత అనే విద్యార్థినికి సైకిల్ అందజేశారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ శేఖర్‌గౌడ్‌కు కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచుల సంఘం అధ్యక్షుడు నల్ల వంశీధర్ రెడ్డి, రొడ్డ పృథ్వీరాజ్, రామంచ గోపాల్ రెడ్డి, ఎంపీటీసీలు రామాంజనేయులు, సులోచన, సొసైటీ అధ్యక్షుడు గోవింద రెడ్డి, నాయకులు ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, అభిమానులు పాల్గొన్నారు.

మహేందర్‌రెడ్డి సేవలు మరువలేనివి


చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

హుజూరాబాద్‌రూరల్ : బీఆర్ఎస్ నాయకుడు నందగిరి మహేందర్‌రెడ్డి చేసిన సేవలు మరువలేనివని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకులు ఇనుగాల పెద్దిరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని మధువని గార్డెన్‌లో నందగిరి మహేందర్‌రెడ్డి సంస్మరణ సభ జరిగింది. సభకు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహేందర్‌రెడ్డితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. రెడ్డి జాగృతి నాయకుడు పోరెడ్డి శంతన్ రెడ్డి, కౌన్సిలర్ పైళ్ల వెంకట్‌రెడ్డి, వీహెచ్‌పీ నాయకులు, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

చొప్పదండి: ప్రతి కార్యకర్త, నాయకులు కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఎల్‌డీఎమ్మార్‌సీ కో ఆర్డినేటర్, సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. రిజర్వ్‌డ్ నియోజకవర్గంలో లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్ కార్యక్రమంలో భాగంగా మండలకేంద్రంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ గెలుపు తర్వాత కార్యకర్తలు ఉత్సాహంగా ఉన్నారన్నారు. సమావేశంలో నాయకులు కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, ముద్దం తిరుపతి, కొట్టె అశోక్, గంగయ్యగౌడ్, పురం రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

మల్టీ పర్పస్ వర్కర్ తొలగింపు ?

వీణవంక: మండలంలోని బొంతుపల్లి గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న మల్టీ పర్పస్ వర్కర్‌ను విధులను నుంచి తొలగించినట్లు తెలిసింది. డీజిల్ బిల్లుల విషయంలో ఫోర్జరీ జరిగిందని 2022 జూన్ 10న గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ చదువు జితేందర్ రెడ్డి లోకాయుక్తను ఆశ్రయించాడు. విచారణ అధికారిగా ఎంపీవోను నియమించగా విచారించిన ఎంపీవో సంబంధిత నివేదికను లోకాయుక్తకు సమర్పించారు. నివేదిక ఆధారంగా జితేందర్ రెడ్డి జిల్లా కలెక్టర్‌కు 2022 డిసెంబర్ 5న ఫిర్యాదు చేశాడు. అయితే డీజిల్ బిల్లుల విషయంలో మల్టీ పర్పస్ వర్కర్‌ను విధుల నుంచి తొలగించినట్లు కలెక్టర్‌కు డీఎల్‌పీవో నివేదిక ఇచ్చినట్లు ఫిర్యాదుదారుడు పేర్కొన్నారు.

ఆదమరిస్తే అంతే..

- పొంచి ఉన్న విద్యుత్ ప్రమాదాలు
- పలుగ్రామాల్లో ప్రమాదకరంగా ట్రాన్స్ ఫార్మర్లు
- జాగ్రత్తలు పాటించాలని అధికారుల సూచన
- విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న ఆయాగ్రామాల ప్రజలు


గన్నేరువరం మండలం చొక్కల్లపల్లి రోడ్డు పక్కన కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

మానకొండూర్: అసలే వర్షాకాలం.. భారీ వర్షాలకు విద్యుత్ స్తంభాలు నేలకొరగడం, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏ చిన్న పొరపాటు జరిగినా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. రైతులు పొలం పనుల్లో బిజీగా ఉంటారు. స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సమస్య తలెత్తితే విద్యుత్ సరఫరా లేదంటే చాలు వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్ చేసి, ఫ్యూజ్ వైర్ సరిచేయడం, పశువులను విద్యుత్ స్తంభాల వద్దే మేత కోసం కట్టేయడం, ఇంట్లో ఇనుప తీగపై దుస్తులు ఆరేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇలాంటి సమస్యలు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. విద్యుత్ వినియోగదారులు, ప్రజలు జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ అధికారులు, సిబ్బంది సూచిస్తున్నారు. అధికారులు గ్రామాల్లోని విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మానకొండూర్‌లో ..

మండలకేంద్రంలోని తూర్పు దర్వాజ వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. నిత్యం ఇక్కడి నుంచి అన్నారం, పచ్చునూర్, మామిడాలపల్లి, వీణవంక, చల్లూర్, జమ్మికుంట వరకూ ప్రయాణికులు వెళ్తుంటారు. ఈ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద బస్సులు, ఆటోల కోసం ప్రయాణికులు వేచి ఉంటారు. కంచె లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

నివాసాల మధ్యే..

శంకరపట్నం మండలంలోని కరీంపేటలోని బీసీ కాలనీలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. పశువులను మేతకోసం వదిలితే విద్యుత్ ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. కరీంపేట, ఇప్పలపల్లికి ఇది ప్రధాన రోడ్డు. బీసీకాలనీ ఇళ్లలోనే ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అధికారులు కంచె ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

చొక్కల్లపల్లి వద్ద..

గునుకుల కొండాపూర్‌లోని చొక్కల్లపల్లి నుంచి సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం వడ్లూర్‌కు వెళ్లే రహదారిపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. గతంలో ఇక్కడ మూగజీవాలు మృతిచెందిన సంఘటనలున్నాయి. అయినా విద్యుత్ అధికారులు కంచె ఏర్పాటు చేయడం లేదు. వాహనదారుల అదుపుతప్పితే నేరుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొని ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని వాపోతున్నారు.


మానకొండూర్ తూర్పు దర్వాజ వద్ద కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

సిబ్బందికి సమాచారం అందించాలి

వర్షాకాలలంలో విద్యుత్ సమస్యలు ఎక్కువగా ఉంటాయి. రైతులు ప్రజలు, అజాగ్రత్తగా ఉండకూడదు. విద్యుత్ సమస్య ఉంటే అధికారులకు సమాచారం అందించాలి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రైతులు ఫ్యూజ్ వైరు సరిచేయొద్దు. గ్రామాల్లో విద్యుత్ సపోర్టు వైర్ల వద్ద ఇన్సులేటర్లు పగిలి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ప్రజలు జాగ్రత్తలు పాటించాలి.

– ఏఈ రమేశ్, చెంజర్ల విద్యుత్ సబ్ స్టేషన్

ఘనంగా ఆషాఢ మాస బోనాలు


మానకొండూర్ : బోనాలతో తరలివెళ్తున్న మహిళలు

మానకొండూర్: మండల కేంద్రంలోని ఎస్సీకాలనీ మహిళలు ఆషాఢ మాసం సందర్భంగా బోనాలు నిర్వహించారు. ఇంటింటా మహిళలు బోనాలు నెత్తిన నెత్తుకొని డప్పుచప్పుళ్ల మధ్య, గ్రామ శివారులోని మహంకాళి ఆలయానికి తరలివెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు పండాలని వేడుకున్నారు.

బూర్గుపల్లిలో..

గంగాధర: మండలంలోని బూర్గుపల్లి గ్రామంలో ఆదివారం శాలివాన సంఘం వారి ఆధ్వర్యంలో ఎల్లమ్మ, పోచమ్మ తల్లి బోనాలను నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో డప్పు చప్పుళ్ల మధ్య ఆలయాలకు తరలివెళ్లారు. నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని వేడుకున్నారు. ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో బోనాలు నిర్వహిస్తామని సంఘం నాయకులు పేర్కొన్నారు.


గంగాధర : బూర్గుపల్లిలో..

వెన్కెపల్లిలో ..

సైదాపూర్: మండలకేంద్రంలోని వెన్కెపల్లిలో మహంకాళి బోనాలను కురుమ కులస్తులు ఘనంగా నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాల మధ్య ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి వెళ్లి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఏటా కురుమలు మాత్రమే అమ్మవారి బోనాల జాతర నిర్వహిస్తారు. ఈ ఏడాది మహంకాళి బోనాల జాతర అధ్యక్షుడు ఈరాల భిక్షపతి ఆధ్వర్యంలో నిర్వహించారు.

సన్మానం


ప్రశాంత్‌ను సన్మానిస్తున్న కవ్వంపల్లి సత్యనారాయణ

గన్నేరువరం: గొల్ల కురుమ యాదవ సంఘం మండల అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన సందవేని ప్రశాంత్‌ను డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కవ్వంపల్లి సత్యనారాయణ ఆదివారం మండలకేంద్రంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మెర రవీందర్ రెడ్డి, యూత్ నాయకులు అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు బొడ్డు సునీల్, కాల్వ రాజు యాదవ్, సందవేని మల్లేశ్‌యాదవ్, అల్లూరి మహిపాల్ రెడ్డి, ముస్కు సంతోష్‌రెడ్డి, అన్నాడి నరేందర్ రెడ్డి, పీచు రాజిరెడ్డి, తాడూరి వంశీకృష్ణరెడ్డి పాల్గొన్నారు.

నేతల మధ్య సమన్వయం పెంపొందించేందుకే టిఫిన్ బైటక్


సమావేశమైన బీజేపీ నాయకులు

ఇల్లందకుంట : బీజేపీ నాయకుల మధ్య సమన్వయం పెంపొందించేందుకే టిఫిన్ బైటక్ ప్రధాన ఉద్దేశమని పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో నియోజకవర్గ స్థాయి టిఫిన్ బైటక్ సమావేశానికి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు, మాడ గౌతమ్ రెడ్డి, బింగి కర్ణాకర్, నరసింహ రాజు, ముత్యం రావు, జెళ్ల సుధాకర్, తుమ్మ శోభన్, శీలం శ్రీనివాస్, జీడి మల్లేశ్, పల్లపు రవి, తదితరులు పాల్గొన్నారు.

క్వారీ పనుల అడ్డగింత

చిగురుమామిడి: మండలంలోని కొండాపూర్-నవాబుపేట్ గ్రామాల మధ్య సర్వేనెంబర్ 196 లో గల నర్సింహస్వామి గుట్ట వద్ద నడుస్తున్న క్వారీ పనులను ఆదివారం వడ్డెర కులస్తులు అడ్డుకున్నారు. క్వారీ ఏర్పాటుతో తాము జీవనోపాధిని కోల్పోతున్నామని , బండరాయి కొట్టుకొని జీవనం సాగిస్తున్న తమ బతుకులు రోడ్డున పడుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ తెలంగాణ వడ్డెర జనచైతన్య సంక్షేమం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల వెంకటేశ్, మండల అధ్యక్షుడు అల్లెపు సంపత్, కొండాపూర్ గ్రామ వడ్డెర సంఘం నాయకులు బత్తుల రాజయ్య, బోదాసు రవి, పల్లపు సుధాకర్, రమేశ్, మల్లేశ్, సంపత్, చెన్నయ్య, కనుకయ్య, శ్రీనివాస రాజు, పలువురు ఉన్నారు.


క్వారీ పనులను అడ్డుకుంటున్న వడ్డెర సంఘం నాయకులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు


సమావేశమైన పూర్వ విద్యార్థులు

జమ్మికుంట: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో చదివిన 1996–97 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగింది. పాఠశాలలో చదివిన రోజులను గుర్తు చేసుకొని, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఉపాధ్యాయులు కొమురయ్య, కైలాసం, మనోహర్, గోపాల్ రెడ్డి, చంద్రకళ, తిరుపతి రెడ్డి, నరసింహరాజు, శ్రీధర్ రావు, రామనాథం, బొందయ్య, కళాధర్, వరదరాజుకు పాదపూజ చేసి సన్మానించారు. కార్యక్రమంలో దేశినికోటి, కడాల రామమూర్తి, మల్లికార్జున్, రమేశ్, సురేశ్, మొగిలి, అంకూష్, జగన్, నెదూరి శ్రీనివాస్, జక్కుల రాజు, సుంకర శ్రీనివాస్, రమేశ్, వేణు, స్నేహితులు పాల్గొన్నారు.

నాగార్జున ఉన్నత పాఠశాలలో..

హుజూరాబాద్‌రూరల్ : నాగార్జున ఉన్నత పాఠశాలలో చదివిన 1998–99 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పట్టణంలోని టెట్రా కిండర్ గార్డెన్‌లో జరిగింది. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను వారు ఘనంగా సన్మానించారు. రోజంతా ఉల్లాసంగా గడిపారు.

బాలుర ఉన్నత పాఠశాలలో..

చొప్పదండి: మండలకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో చదివిన 1995–96 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

పార్టీకి కార్యకర్తలే పునాది


సమావేశంలో మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్ కుమార్

- ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

తిమ్మాపూర్: పార్టీకి కార్యకర్తలే పునాది అని, కార్యకర్తలు బాగుంటే పార్టీ బలంగా ఉంటుందని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని ఎనిమిదో డివిజన్‌లో మండల ముఖ్య కార్యకర్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న రోజుల్లో ప్రతీ కార్యకర్త పార్టీ గెలుపుదిశగా పనిచేయాలని కోరారు. మానకొండూర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే అన్నారు. ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటామన్నారు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పార్టీ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే పార్టీ ధ్యేయం

చిగురుమామిడి: రైతులకు ఉచిత కరెంట్ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని, రైతుల శ్రేయస్సే తమ ప్రధానమని మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని సుందరగిరిలో పల్లెపల్లెకు ప్రవీణన్న, గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్టీ జెండా ఆవిష్కరించి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఇంటింటా తిరుగుతూ ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ, మహిళలకు రూ.500 సిలిండర్, రూ.4వేల పింఛన్ అందిస్తామన్నారు. కావాలనే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు బురదజల్లుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గంలో ఎన్ని డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇచ్చారో చెప్పాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి ఐరెడ్డి సత్యనారాయణ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతి రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు లక్ష్మణ్, గుడాటిపల్లి సర్పంచ్ బద్దం రాజిరెడ్డి, జిల్లా యూత్ నాయకులు బోయిని నరేశ్, మహిళా నాయకురాలు ఓరుగంటి భారతిదేవి, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు


బోర్నపల్లిలో పేర్లు నమోదు చేసుకుంటున్న గ్రామస్తులు

జమ్మికుంట: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పింగిళి రమాదేవి, కేడీసీసీ వైస్ చైర్మన్ పింగిళి రమేశ్ అన్నారు. మండలంలోని విలాసాగర్ గ్రామంలో ఆవోపా, ఐఎంఏ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో 400 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందుల పంపిణీ చేశారు. గ్రామీణ పేదలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు కృషిచేస్తున్న ఆవోపా, ఐఎంఏ సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆవోపా అధ్యక్షుడు నర్సయ్య, ప్రధాన కార్యదర్శి బాదం సురేశ్, ఐఎంఏ డాక్టర్లు అంకం సుధాకర్, సురేశ్, సత్యం, సావిత్రి, రాజేశ్వరయ్య, ముక్క రాము, ముక్క శరత్ బాబు, మౌనిక , సింధు, సురేశ్, కిషోర్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బోర్నపల్లిలో..

హుజూరాబాద్ రూరల్ : మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లిలో బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం హన్మకొండ లక్ష్మీ నరసింహా ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పోతరవేని కొమురమ్మ, వైద్యురాళ్లు సౌజన్య, కల్పన, బాలవికాస సంస్థ ప్రతినిధి ఖాజాబి, రాజేశ్వరి, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

భిక్షాటనతో జీపీ కార్మికుల నిరసన


కేశవపట్నంలో భిక్షాటనతో నిరసన తెలుపుతున్న జీపీ కార్మికులు

శంకరపట్నం : మండలకేంద్రంలో ఆదివారం జీపీ కార్మికులు భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. సమస్యల సాధన కోసం సిబ్బంది చేపట్టిన సమ్మె పదకొండో రోజుకు చేరింది. మండలంలోని గద్దపాక, రాజాపూర్, మక్త, లింగాపూర్‌లో కార్యదర్శులు, కూలీలతో పనులు చేయిస్తున్నారని జీపీ సిబ్బంది అడ్డుకోవడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. జిల్లా అధ్యక్షుడు రాచర్ల మల్లేశం, తిరుపతి రావు, సారయ్య, రాజు, సతీశ్, నరేశ్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీలో సీటు


దీప్తిమంత్

సైదాపూర్: మండలంలోని గొల్లగూడెం విద్యార్థి చల్లూరి దీప్తిమంత్ కర్ణాటక ఐఐటీలో సీటు సాధించాడు. గొల్లగూడెంకు చెందిన దీప్తిమంత్ తండ్రి చల్లూరి సంపత్ ఉపాధ్యాయుడు. దీప్తిమంత్ హైదరాబాద్‌లోని కేకేఆర్ గౌతమ్ పాఠశాలలో పదో తరగతి చదివాడు. శ్రీ చైతన్య కాలేజీలో ఇంటర్ పూర్తిచేశాడు. అందులోనే ఐఐటీ కోచింగ్ తీసుకొని కర్ణాటక ఐఐటీలో సీటు సాధించాడు.

- సంఘం అభివృద్ధికి కృషి

వీణవంక: పెరుక కుల సంఘం అభివృద్ధిగా తనవంతు కృషి చేస్తానని పెరుక కుల సంఘం జిల్లా కార్యదర్శి అప్పని హరీశ్ వర్మ అన్నారు. మండలంలోని రామకృష్ణాపూర్‌లో మాట్లాడారు. జిల్లా కార్యదర్శిగా నియామకానికి కృషి చేసిన కుల బాంధవులకు కృతజ్ఞతలు తెలిపారు.